చలో మెడికల్ కాలేజీ విజయవంతం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజలు

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పు బడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ పెనుకొండలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమం విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ పిలుపుతో పెనుకొండ మెడికల్ కాలేజీ సందర్శనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పెనుకొండ దద్దరిల్లింది. పట్టణ వీధులన్నీ జనాలతో నిండిపోయాయి. మెడికల్ కాలేజీ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడాయి. నిర్మాణం పూర్తయిన రెండంతస్తుల భవనంపై వైఎస్సార్‌సీపీ జెండాలు ఉంచి నినాదాలు చేశారు. జై జగన్ అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో మెడికల్ కాలేజీ ప్రాంతం మార్మోగింది. కూటమి ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భవనం పైకెక్కి ప్లకార్డులు ప్రదర్శించారు. ప్రముఖులు మాట్లాడే సమయంలో ప్లకార్డులు, జెండాలు చేతపట్టి ఉత్సాహంగా కనిపించారు.

అదుగో మెడికల్ కాలేజ్

పెనుకొండలో మెడికల్ కాలేజ్ భవనాలను చూపిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు.. కూటమి నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. పెనుకొండలో మెడికల్ కాలేజ్ ఎక్కడ ఉందన్న కూటమి నేతల మాటలను తిప్పికొట్టారు. భవనం వద్దకెళ్లి ఫొటోలు, సెల్ఫీలు దిగి సమాధానం ఇచ్చారు. పేద విద్యార్థుల వైద్య విద్య కోసం ప్రవేశపెట్టిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తే ఎందాకైనా ఉద్యమిస్తామని వైఎస్సార్‌సీపీ నేతలు హెచ్చరించారు.

పెనుకొండకు తరలివెళ్లిన మడకశిర నేతలు

మడకశిర: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం పెనుకొండలో నిర్వహించిన 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమానికి నియోకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకత్వంలో ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి కూటమి ప్రభుత్వం తీసుకున్న మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గళం విప్పారు. మాజీ మంత్రి నర్సేగౌడ్, రాష్ట్ర కార్యదర్శులు రవిశేఖర్‌రెడ్డి, వాగేష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, కుంచిటి వక్కలిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగేగౌడ్, బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంతరాజు, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నితిన్‌రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు శివప్రసాద్, మడకశిర పట్టణ కన్వీనర్ బోయ సతీష్ కుమార్, వివిధ మండలాల కన్వీనర్లు రామిరెడ్డి, జారేగౌడ్, త్రిలోక్‌నాథ్, శ్రీనివాస్, నరసింహారెడ్డి, మడకశిర యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, పార్టీ వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికార్జున, సికిందర్, నరసింహ, శివానంద, శివప్ప తరలివెళ్లారు.



'చలో మెడికల్ కాలేజీ' కార్యక్రమానికి తరలివెళ్లిన ఈరలక్కప్ప, నాయకులు, పాల్గొన్న మడకశిర నేతలు

ప్రైవేటీకరణను అడ్డుకుంటాం | వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక


పార్టీ కార్యాలయం వద్ద విద్యార్థినులతో కలిసి మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిలమత్తూరు: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక స్పష్టం చేశారు. శుక్రవారం దీపిక ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున చలో మెడికల్ కళాశాల కార్యక్రమంలో భాగంగా పెనుకొండకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా హిందూపురంలో ఆమె మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం వైఎస్ జగన్ పేదలకు వైద్య విద్యను దగ్గర చేయాలని సంకల్పించి 17 మెడికల్ కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలని చూస్తుండటం దుర్మార్గమన్నారు. ప్రైవేటుకరణపై వెనక్కి తగ్గేవరకూ ఆందోళన చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి, విద్యార్థి విభాగం నేతలు కదిరీష్, మింటు , జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, రాము, సయ్యద్ నిస్సార్, పార్టీ నేతలు సురేష్‌కుమార్‌రెడ్డి, ఉపేంద్రరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు | వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిర: మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన చలో పెనుకొండ మెడికల్ కళాశాల నిరసన కార్యక్రమం విజయవంతమైందని మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, మేధావులు, విద్యావంతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటీకరణను ఆపకపోతే ప్రజలు ఆందోళనకు దిగడం ఖాయమని హెచ్చరించారు. నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే వాల్మీకులకు న్యాయం

మడకశిర: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వాల్మీకులకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. శుక్రవారం చలో పెనుకొండ కార్యక్రమానికి వెళుతున్న సందర్భంగా పట్టణంలోని వాల్మీకి విగ్రహం వద్ద పూజలు చేశారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వాల్మీకులకు ఎన్నో పదవులిచ్చిన ఘనత వైఎస్ జగన్‌దేనన్నారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ వాల్మీకి సతీష్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, స్థానిక నాయకులు సత్యనారాయణ యాదవ్, ఓంకార్, నవీన్‌కుమార్, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సహకార సంఘాల అభివృద్ధికి కృషి


ఎమ్మెల్యే వెంకటేష్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

పావగడ: డీసీసీ బ్యాంకు పరిధిలోని సహకార సంఘాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ తెలిపారు. తాలూకాలోని గుమ్మఘట్టలో వీఎస్ఎస్ఎన్ సంఘం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన సంఘం వార్షిక సర్వ సభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఎస్ఎస్ఎన్ సంఘం బలోపేతానికి సంఘం పదాధికారులు, డైరెక్టర్లు కృషి చేయాలన్నారు. పాడి రైతులకు ఆవుల కొనుగోలుకు రుణ సౌకర్యం కల్పిస్తానన్నారు.

గణేష్ ఉత్సవాలు విజయవంతం చేయడం హర్షణీయం

హిందూపురం: పట్టణంలో గణేష్ నవరాత్రులతో పాటు నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా పూర్తయ్యేలా చూసిన అధికారులు, పోలీసులు, పట్టణ ప్రముఖులకు గణష్ ఉత్సవ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రమేష్‌కుమార్, వన్ టౌన్ సీఐ రాజగోపాల్‌నాయుడు, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తదితర ప్రముఖులను సన్మానించారు. కార్యక్రమంలో వైటీపీ శ్రీనివాసులు, ఆదర్శ్‌కుమార్, రాము, రమేష్‌రెడ్డి, పాండురంగారావు, టీకే బాబు, రమేష్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపల్లిలో కార్డెన్ సెర్చ్

మడకశిరరూరల్: మండల పరిధిలోని టీడీపల్లిలో శుక్రవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో పర్యటించి పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మాట్కా, జూదం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అక్రమ నాటుసారా, కర్ణాటక మద్యాన్ని ఎవరైనా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

స్వచ్ఛత హీ సేవా వారోత్సవాలు ప్రారంభం


పాఠశాల పరిసరాలు శుభ్రం చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలో నేతాజీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మున్సిపల్ డీఈ రమేష్ పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛత హీ సేవా 2025 వారోత్సవాలు అక్టోబర్ 2 వరకూ జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ ఇంట్లోనూ, బయట చుట్టుపక్కల ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ బ్యాగులు, ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ పేపర్లు వాడకూడదని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమణ, మూర్తి, హెల్త్ అసిస్టెంట్ కేశవ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పెనుకొండలో ర్యాలీ

పెనుకొండ: ఆర్డీటీకి ఎఫ్‌సీఏఆర్ పునరుద్ధరించాలని కోరుతూ పట్టణంలో శనివారం బహుజన చైత్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్షుడు శివరామకృష్ణ తెలిపారు.

లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వీధి వ్యాపారులు లోక్ కల్యాణ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ కోరారు. మున్సిపల్ చైర్మన్ నరసింహరాజు అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయంలో లోక్ కల్యాణ్ మేళాపై వీధి వ్యాపారులకు అవగాహన కల్పించారు. వీధి వ్యాపారులకు రెండో విడత రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ మేళా అక్టోబర్ 25వ తేది వరకు జరుగుతుందన్నారు.

ఘనంగా 'హిందీ దివాస్'


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

రొద్దం: మండలంలోని కోగిర గ్రామ జెడ్పీహెచ్ఎస్‌లో హిందీ పండితుడు జాబిలి చాంద్‌బాషా ఆధ్వర్యంలో, పాఠశాల హెచ్‌ఎం హరికిరణ్ అధ్యక్షతన శుక్రవారం జిల్లా స్థాయి హిందీ దివాస్ ఘనంగా నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి 30 మంది నిష్ణాతులైన సీనియర్ హిందీ ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కవి, రచయిత, సామాజిక సేవాకార్యకర్త, రాష్ట్ర పురస్కార గ్రహీత జాబిలి చాంద్‌భాషాను సన్మానించారు. హిందీ భాషా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల నిరసన


హిందూపురం: సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసు వద్ద నిరసన తెలియజేస్తున్న డ్యాకుమెంట్ రైటర్లు


మడకశిర: దస్తావేజు లేఖరులు సబ్‌రిజిస్ట్రార్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

- సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో నిలిచిపోయిన క్రయవిక్రయాలు

మడకశిర: కూటమి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ శుక్రవారం మడకశిరలో దస్తావేజు లేఖరులు (డాక్యుమెంట్ రైటర్లు) నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నూతనంగా తీసుకువచ్చిన సాఫ్ట్‌వేర్‌ను తొలగించాలంటూ స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ నిర్వహించడంతో ఆస్తుల రిజిస్ట్రేషన్‌లకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. క్రయ విక్రయాలకు వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్తుల రిజిస్ట్రేషన్‌లో కొత్త సాఫ్ట్‌వేర్‌ను తీసుకురావడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల నానా తంటాలు పడాల్సివస్తోందని వాపోయారు. కొత్త సాఫ్ట్‌వేర్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు లోకేష్, అతావుల్లా, శివప్ప, జిలాన్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: డాక్యుమెంట్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సాఫ్ట్‌వేర్ కొత్త అప్‌గ్రేడ్ కారణంగా రైటర్లు, క్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని డాక్యుమెంట్ రైటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆటోమ్యుటేషన్ల విధానాలను అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. శుక్రవారం హిందూపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంటరీ రైటర్లు నల్లబ్యాడ్జిలతో పెన్‌డౌన్ చేపట్టారు. క్రయదారులకు ఆలస్యం కాకుండా సులువైన పద్ధతిలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన సాఫ్ట్‌వేర్‌ను పునరుద్ధరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్ల సమ్మెతో హిందూపురం సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. అధికారులు త్వరితగతిన స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే పెన్‌డౌన్ కొనసాగుతుందని డాక్యుమెంటరీ రైటర్లు చౌడేష్, లక్ష్మీనారాయణ, హనుమంతరెడ్డి, రాంప్రసాద్ తదితరులు హెచ్చరించారు.

సోలార్ కంపెనీ మాయలో పడొద్దు

రొద్దం: సోలార్ కంపెనీల మాయలో పడి భూముల హక్కులను కోల్పోవద్దని రైతు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఫక్రోద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పలు డిమాండ్లతో కూడిన కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులు తొందరపడి సోలార్ కంపెనీలకు, సెజ్‌లకు, హబ్‌లకు, ఏపీఐఐసీ కోసం మీ భూములను లీజుకు కానీ, అమ్మడానికి కానీ ఇవ్వదని విజ్ఞప్తి చేశారు. 10 సంవత్సరాల తరువాత కౌలు ఒప్పందం రద్దు చేసుకునే స్వేచ్ఛ రైతులకు ఉండాలన్నారు.


రొద్దం: కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం, మణూరు, బుళ్లసముద్రం, కల్లుమర్రి, వైబీహళ్లి పంచాయతీల్లోని గ్రామాల్లో శుక్రవారం జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు హరి కేవీపీఎస్ నాయకులతో కలిసి పర్యటించారు. సోలార్ కంపెనీ మాయలో పడి భూముల హక్కులను కోల్పోవద్దని రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ కమిటీ సభ్యులు రామాంజినేయులు, గోవిందప్ప, యోగానంద్, రవి, లక్ష్మీనరసప్ప, ముద్దరంగప్ప తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

మడకశిరరూరల్: మండలంలోని సీ కొడిగేపల్లిలోని పాఠశాలలో శుక్రవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ వైద్య సేవలు నిర్వహించారు. వైద్యులు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య పరంగా ఏ సమస్య వచ్చిన నిర్లక్ష్యం చేయకుండా వైద్య చికిత్స తీసుకోవాలన్నారు. సూపర్ వైజర్ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ లిఖిత

మడకశిర: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో శుక్రవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వచ్చే నెల 2 వరకూ కార్యక్రమం కొనసాగు తుందన్నారు. మహిళల ఆరోగ్యానికి అవసరమైన అన్ని పరీక్షలను నిర్వహిస్తారన్నారు. మెడికల్ ఆఫీసర్ శశిరేఖ, ఏపీఐఐసీ డైరెక్టర్ రామకృష్ణ, రొళ్ళ సింగిల్ విండో అధ్యక్షుడు దాసిరెడ్డి, డాక్టర్లు ప్రభాకర్‌నాయుడు, నీరజ, సాహిత్య, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


ఎంపీడీఓ రామరావుకు వినతిపత్రమిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అమరాపురం: గ్రామ వార్డు సచివాలయ అసోసియేషన్ పిలుపు మేరకు మండలంలోని గ్రామ సచివాలయాల సిబ్బంది శుక్రవారం తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ఎంపీడీఓ రామరావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్హత ఆధారంగా అన్ని శాఖల సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించాలని, ఇంటింటా సర్వేలు, క్లస్టర్ మ్యాపింగ్, వలంటీర్లు చేసే విధుల నుంచి తమను తప్పించాలన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

రొద్దం: ప్రతి మహిళా చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకోవడం అవసరమని అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పి.రొప్పాలలో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహాల మండలి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలకు నాటిక రూపంలో చట్టాలపై అవగాహన కల్పించారు.

దివ్యాంగులకు సదుపాయాల కల్పనకు కృషి

హిందూపురం: దివ్యాంగులకు అవసరమైన సదుపాయల కల్పన కోసం సంక్షేమ కేంద్రం కృషి చేస్తోందని సక్షమ్ జిల్లా కన్వీనర్ పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం హిందూపురం సక్షమ్ దివ్యాంగ సేవా కేంద్రంలో పట్టణ ప్రముఖులు మిశ్రీమాల్, శ్రీనివాస్‌లు రైల్వే పాసులు, ఇతర సదుపాయలకు అవసరమయ్యే యూనిక్ డిజబులిటీ ఐడీ కార్డులను పంపిణీ చేశారు.

ఈరలక్కప్పను కలిసిన నితిన్‌రెడ్డి

మడకశిర: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి నితిన్‌రెడ్డి శుక్రవారం ఫళారంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్పను కలిశారు. ఇటీవలనే నితిన్‌రెడ్డిని పార్టీ హైకమాండ్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈ నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అలాగే సిద్దగిరిలో జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డిని కూడా కలిశారు.

రైతుకు పాముకాటు

అగళి: మండల పరిధిలోని ఇనగలూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి పాముకాటుకు గురయ్యారు. తన వ్యవసాయ భూమిలో పనిచేసుకుంటుండగా నరసింహమూర్తిని పాము కరిచిందని గ్రామస్తులు తెలిపారు.వెంటనే అతన్ని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందన్నారు.

ఆర్థికాభివృద్ధికి కృషి చేయండి

అమరాపురం: మహిళా సంఘాల సభ్యులు మండల సమాఖ్య ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని ఏపీఎం ముత్యాలప్ప, హేమ మండల మహిళా అధ్యక్షురాలు సుజాత సూచించారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో హేమ మహిళా సమాఖ్య 21వ మహా సభలను అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీసీలు లక్ష్మికాంత్, గోపాల్‌కృష్ణ, భాస్కర్, శ్రీనివాసులు, నాగరాజు 46 గ్రామైక్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎంపిక

రొళ్ల: గ్రామ వార్డు సచివాలయం జేఏసీ పిలుపు మేరకు మండల జీఎస్‌డబ్ల్యూఎస్ ఎంప్లాయిస్ యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. మండల ప్రెసిడెంట్‌గా పి.రవి, వైస్ ప్రెసిడెంట్‌గా సీఎస్ శశికుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బాలాజీనాయక్, సెక్రెటరీగా ఆంజనేయులు, జాయింట్ సెక్రెటరీగా కిరణ్‌కుమార్, ఉమెన్స్ సెక్రెటరీగా అరుణ, ట్రెజరర్‌గా మౌనిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

పరిగి: మండలంలోని ఎర్రగుంటకు చెందిన అక్కమ్మ అనే మహిళపై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉంటున్న నాగరాజు భార్య అక్కమ్మ ఇంటి ముందు పక్కింటికి చెందిన శ్రీరాములు, ముద్దమ్మ, నరసింహమూర్తి చెత్తనంతా తెచ్చిపడేశారు. ఈ క్రమంలో అక్కమ్మ వారితో వారించగా ముగ్గురు కలిసి అక్కమ్మపై దాడి చేశారు. అక్కమ్మ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని పులమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్, రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఫుట్‌బాల్ పోటీల్లో లక్ష్మీనారాయణ, తనూజ, ఆఫీపా, మేఘన, రగ్బీ పోటీల్లో వైష్ణవి, వర్ష, యశ్వసిని, నవ్య, గురుసాయినాయక్ ఎంపికై నట్లు పేర్కొన్నారు. వారు ఈనెల 15, 16 తేదీల్లో అనంతపురంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం హర్షణీయమని కమిటీ చైర్మన్ నరసింహమూర్తితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికై వీఆర్‌ఏల ఆందోళన


పెనుకొండ: తహసీల్దార్ స్వాతికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు


మడకశిరలో నిరసన తెలుపుతున్న రెవెన్యూ సహాయకులు

సాక్షిబృందం: తమ సమస్యలు పరిష్కరించాలంటూ వీఆర్‌ఏలు ఆందోళన చేపట్టారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నామని, అయినా ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పలుసార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తమ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు వీఆర్‌ఓలుగా ప్రమోషన్ ఇవ్వాలని, నామినీలను వీఆర్‌ఏలుగా గుర్తించాలని, వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. పేస్కేల్ అమలు చేయాలన్నారు. మృతి చెందిన వీఆర్‌ఏ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు.


గుడిబండలో...

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

హిందూపురం టౌన్: బుక్కపట్నం వెలుగు కార్యాలయంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులను నమోదు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా శుక్రవారం పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన సీసీ రవీంద్ర, బుక్ కీపర్ నాగరాజులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కో కన్వీనర్ రామకృష్ణ, ఆటో యూనియన్ అధ్యక్షుడు బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
హిందూపురం డివిజన్
9912220723, 9494767933, 9912220726